క్లుప్తంగా

దళితుల సమస్యలపై పోరాటం



సమావేశంలో పాల్గొన్న నాయకులు

సింధియా: దళితుల సమస్యలపై పోరాటం చేయాలని జిల్లా దళిత హక్కుల పోరాట సమితి నాయకులు తీర్మానించారు. జీవీఎంసీ 63వ వార్డు పరిధి కాకరలోవలోని భగత్‌సింగ్ జంక్షన్‌లో జిల్లా దళిత హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దళితుల రక్షణ కోసం తీసుకువచ్చిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం అమలయ్యేలా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. అంబేడ్కర్ కన్న కలలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం విచ్ఛిన్నం చేస్తుందని, కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా జాతీయ స్థాయిలో ఉద్యమించాలన్నారు. కార్యక్రమంలో సంఘ కార్యవర్గ సభ్యులు టి.కామేశ్వరరావు, వై.కనకేశ్వరరావు, గాలి సాంబమూర్తి, సురేష్ పాల్గొన్నారు.

దివ్యాంగ విద్యార్థులకు స్పీచ్ థెరపీ



కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవోలు త్రినాథరావు, వెంకటేశ్వరరావు తదితరులు

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం జీవీఎంసీ ప్రాథమిక పాఠశాల ఆవరణలోని భవిత కేంద్రంలో దివ్యాంగ విద్యార్థులకు శుక్రవారం స్పీచ్ థెరపీ నిర్వహించారు. ములగాడ ఎంఈవోలు డి.వి.త్రినాథరావు, ఎల్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ మండల పరిధిలో సుమారు 15మంది చిన్నారులు మాట్లాడటంలో ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గుర్తించి, వారికి స్పీచ్ థెరపిస్ట్ బాలేశ్వరి ద్వారా భాష ఉచ్ఛరణలో శిక్షణ ఇప్పించనున్నట్లు చెప్పారు. కేంద్రం వద్ద వారంలో రెండు రోజుల పాటు స్పీచ్ థెరపీ ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జీవీఎంసీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని అరుణకుమారి, ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మిద్దె తోటలు పెంచుదాం



మొక్కలు పంపిణీ చేస్తున్న గ్రీన్ క్లైమేట్ టీం సంస్థ ప్రతినిధులు

గోపాలపట్నం: మిద్దె తోటల పెంపకంపై ప్రజలు ఆసక్తి కనబరుస్తున్నారని.. వాటిని మరింత విస్తృత పరచాలని గ్రీన్ క్లైమేట్ టీం వ్యవస్థాపక కార్యదర్శి జేవీ రత్నం అన్నారు. ఈ మేరకు శుక్రవారం గోపాలపట్నం రైతు బజారు వద్ద కాయగూరల మొక్కలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖను మిద్దెతోటల నగరంగా తీర్చి దిద్దే ఉద్యమంలో అందరూ భాగస్వామ్యం కావాలని కోరారు. మన కూరగాయల తోట, వనమాలి, సీటీజీ సంస్థలకు చెందిన ప్రతినిధులు నారు, బాపట్ల మిర్చి, టమాటా, నాటు బంతి మొక్కల నారు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాదెళ్ల జ్యోతి, గ్రీన్ క్లైమేట్ టీం సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

గోవాకు అశోక్ గజపతిరాజు

గోపాలపట్నం: గోవా గవర్నర్‌గా నియమితులైన పూసపాటి అశోక్ గజపతిరాజు శుక్రవారం అక్కడికి బయల్దేరి వెళ్లారు. ఆయనకు అధికారులు, అభిమానులు ఘనంగా వీడ్కోలు పలికారు. విశాఖ విమానాశ్రయంలో ఎయిర్‌పోర్టు ప్రొటోకాల్ డిప్యూటీ తహసీల్దార్ రవి పుష్పగుచ్ఛం అందించి, వీడ్కోలు పలికారు. ఆయన విశాఖ నుంచి హైదరాబాద్, అక్కడి నుంచి గోవా వెళ్లారు. శనివారం ఆయన గోవాలో ప్రమాణస్వీకారం చేయనున్నారు.

నేటి నుంచి సిటు జిల్లా 13వ మహాసభలు

దాబాగార్డెన్స్: సిటు జిల్లా 13వ మహాసభలు శని,ఆదివారాల్లో కంచరపాలెం ఎం కన్వెన్షన్‌లో జరగనున్నాయి. ఈ మహాసభలకు వివిధ పరిశ్రమలు, రంగాలు, ప్రాంతాలకు చెందిన 270 మంది కార్మిక నాయకులు, ప్రతినిధులు హాజరుకానున్నారు. సిటూ రాష్ట్ర అధ్యక్షుడు ఏవీ నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావుతో పాటు విశాఖ జిల్లా పూర్వ అధ్యక్షుడు ఎంపీఎస్ శర్మ, కార్యదర్శి అజయ్ శర్మ, అనకాపల్లి, అల్లూరి జిల్లాల ప్రతినిధులు పాల్గొంటారు. మూడేళ్లలో సిటు చేపట్టిన కార్యక్రమాలను సమీక్షించుకుని, భవిష్యత్‌లో కార్మిక వర్గాన్ని ఐక్యం చేసి మరిన్ని పోరాటాలు నిర్వహించేందుకు ఈ మహాసభల్లో అనేక తీర్మానాలు చేయనున్నారు.



90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ సమీపంలోని కొండవాలుపై ఇళ్లు



నిర్మాణంలో ఉన్న రక్షణ గోడ




ఇళ్లకు సమీపంలో కూలిన దృశ్యం

గోపాలపట్నం దరి బాజీ జంక్షన్ సమీపంలోని కొండవాలు ప్రాంతం గతేడాది వర్షాకాలంలో కుప్పకూలింది. ఇదే రీతిన 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్‌ను ఆనుకొని ఉన్న కొండవాలు ప్రాంతంలో కూలిపోవడంతో సమీప నివాసితులు భయకంపితులయ్యారు. కొంతమందిని షెల్టర్లకు తరలించారు. ఆ సమయంలో కొండవాలు ప్రాంతాల్లో రక్షణ గోడలు నిర్మిస్తామని పాలకులు ప్రకటించారు. లక్ష్మీనగర్ ఎఫ్ బ్లాక్ కొండవాలు ప్రాంతంలో పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఇంతలో వర్షాకాలం రావడంతో ముప్పు పొంచి ఉందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షాకాలం అంతా దినదిన గండంగానే బతుకు వెళ్లదీయక తప్పదని భయాందోళన చెందుతున్నారు.

– విశాఖ విద్య



కొండచరియలు పడడంతో కూలిన ఇళ్లు



తవ్వి వదిలేశారిలా... రక్షణ గోడ నిర్మాణం ఎప్పుడో..

కొండవాలు... గుండె బేజారు!

- ప్రమాదకర ప్రదేశాల గుర్తింపులో అలసత్వం
- వర్షాకాలం వచ్చినా మేల్కోని అధికారులు
- గతేడాది లక్ష్మీనగర్‌లో కూలిన కొండచరియలు
- రక్షణ గోడల నిర్మాణంలో జాప్యం





కూలిన దారిలో వేసిన తాగునీటి పైప్‌లైన్

జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర్ ఎఫ్–బ్లాక్‌కు ఆనుకొని ఉన్న కొండవాలు ప్రాంతంలో నిరుపేదలు, రోజు వారీ కూలీలు నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. ఇక్కడ సుమారు 250 ఇళ్ల వరకు ఉన్నాయి. ఏళ్ల తరబడి ఇదే చోట ఉంటున్న వీరికి మౌలిక సౌకర్యాలు పూర్తి స్థాయిలో సమకూరలేదు. వర్షాకాలం వచ్చిందంటే చాలు కొండచరియలు జారి పడతాయనే భయంతో రేయింబవళ్లు బితుకు బితుకు మంటూ జీవించాల్సిన దుస్థితి. బతుకు దెరువుకోసం రోజువారీ కూలిపనులకు వెళ్లి తిరిగి ఇంటికి వచ్చిన వీరు వర్షాకాలం వస్తే ఎప్పుడు ఏ బండరాయి వచ్చి పడుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

మౌలిక సౌకర్యాలపై శ్రద్ధ ఏది

ఎన్నో సంవత్సరాల కిందట నిర్మించిన అంతర్గత రహదారులే నేటికీ వారి రాకపోకలకు మార్గం. మెట్ల మార్గం కూడా పలు చోట్ల పాడైంది. పై నుంచి వచ్చే నీరు కిందకు పోయేందుకు డ్రైనేజీ సవ్యంగా లేదు. కమ్యూనిటీ హాల్ శిథిలావస్థకు చేరింది. ఇలాంటి అనేక సమస్యలతో కొండవాలు ప్రాంత ప్రజానీకం సతమతమవుతున్నారు. అలాగే రోడ్డు దెబ్బతిన్నా పట్టించుకోలేదు. పైగా పైప్‌లైన్ వేయడంతో కాలువ దాటి నడవడానికి వృద్ధులు, చిన్నపిల్లలు అవస్థలు పడుతున్నారు.

పురోగతి లేని రక్షణగోడనిర్మాణం

కొండవాలు ప్రాంతాల్లో ప్రజానీకానికి అండగా నిలిచేలా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో అప్పటి జీవీఎంసీ పాలక మండలి రక్షణ గోడల నిర్మాణానికి నిధులు కేటాయించింది. ఈ నేపథ్యంలో జీవీఎంసీ 90వ వార్డు లక్ష్మీనగర ఎఫ్ బ్లాక్ కొండవాలు ప్రాంతంలో రూ.60 లక్షలతో మూడు చోట్ల రక్షణ గోడలు పూర్తి చేశారు. ఎగువ ప్రాంతంలో 92 మీటర్ల మేర రక్షణ గోడ నిర్మాణానికి రూ.1.24 కోట్లు కేటాయించారు. అయితే ఈ పనులు సవ్యంగా ముందుకు సాగడం లేదు. ప్రస్తుతం వర్షాలు కురుస్తుండడంతో రక్షణ గోడ పూర్తయ్యే పరిస్థితి కనిపించడం లేదు.

భయంతో కాలం వెళ్లదీస్తున్నాం



20 ఏళ్ల నుంచి కొండవాలు ఏరియాలో ఉంటున్నాం. ఏడాదికి రెండు సార్లు ఇంటిపన్ను కూడా కడుతున్నాం. ఇంటి ముందు రోడ్డు కుంగిపోయింది. దీన్ని బాగుచేయాలని కోరినా ఎవరూ పట్టించుకోలేదు. ఎన్నో ఏళ్లుగా ఇక్కడే ఉంటున్న మేము ఇంకెక్కిడికీ పోలేం. ప్రతి నిత్యం ఆందోళనతో బతుకుతున్నాం. మా ఇబ్బందులను పట్టించుకొని సౌకర్యాలు కల్పించాలి.

– ముప్పం దయామణి

మా ఇల్లు కూలిపోయింది



ఆంజనేయ స్వామి గుడి వద్ద ఉన్న మా ఇంటిపై కొండచరియలు పడడంతో కూలిపోయింది. సమీపంలో అద్దె ఇంట్లో ఉంటున్నాం. ఇప్పుడు ఉన్న ఇంటి ముందు దారి కూడా మొన్నటి వర్షాలకు కూలిపోయింది. వానాకాలంలో ఇక్కడ ఉండడం భయంగానే ఉంది. కూలి చేసుకునేటోళ్లం. ఇంకెక్కడికీ పోలేం. అధికారులు, పాలకులు స్పందించి వసతులు కల్పించాలి.

– కర్ర గౌరి

కొండ ప్రాంతం కావడంతో..

కొండవాలు ప్రాంతంలో రక్షణ గోడలు పటిష్టంగా నిర్మించేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. మూడు చోట్ల ఇప్పటికే పనులు పూర్తయ్యాయి. కొండపై పనులు కావడంతో కొంత ఇబ్బంది ఉంది. అయినప్పటికీ సకాలంలో పూర్తి చేసేలా పర్యవేక్షణ చేస్తున్నాం.

– వెంకటలక్ష్మి, జోన్–8 పబ్లిక్ వర్క్స్ ఏఈ

14 మంది పేకాటరాయుళ్ల అరెస్ట్

పెందుర్తి: పెందుర్తి, గోపాలపట్నం పోలీస్ స్టేషన్ల పరిధిలో గుట్టు చప్పుడు కాకుండా జరుగుతున్న పేకాట స్థావరాలపై నగర టాస్క్‌ఫోర్స్ పోలీసులు శుక్రవారం రాత్రి దాడి చేశారు. సుజాతనగర్‌లోని ఓ ఇంట్లో, గోపాలపట్నం ప్రాంతంలో ఓ నిర్మానుష్య ప్రదేశంలో పేకాట ఆడుతున్నట్లు టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. ఈ నేపథ్యంలో శిబిరాలపై దాడిచేసిన టాస్క్‌ఫోర్స్ పోలీసులు 14 మందిని అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.48,620 నగదు స్వాధీనం చేసుకున్నారు. తదుపరి చర్యల నిమిత్తం ఆయా కేసులను పెందుర్తి, గోపాలపట్నం పోలీస్ స్టేషన్‌లకు అప్పగించారు.

పరిశుభ్రతతో వ్యాధులు దూరం



ఫ్రైడే డ్రై డే అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న శానిటరీ, మలేరియా అధికారులు

మల్కాపురం: వాతావరణంలో మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ జాగ్రత్తలు పాటించాలని మలేరియా జిల్లా హెల్త్ సూపర్‌వైజర్ సూర్యనారాయణ, మల్కా పురం ఏరియా విభాగ అధికారి డి.రవికుమార్ సూచించారు. పరిశుభ్రతను పాటించడం ద్వారా వ్యాధులకు దూరంగా ఉండవచ్చన్నారు. జీవీఎంసీ 60వ వార్డు ఇందిరా కాలనీలో మల్కాపురం ఏరియా మలేరియా విభాగ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్రైడే .. డ్రైడే అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. నీటిని ఎక్కువరోజులు నిల్వ ఉంచొద్దని, వారానికి ఒకరోజు డ్రై డే పాటించాలని సూచించారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు అధికారులు అవసరమైన చర్యలు తీసుకుంటున్నారని, ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో 58, 59, 60 వార్డుల శానిటరీ ఇన్‌స్పెక్టర్లు సునీల్, వి.సతీష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా శ్రావణ మాస పూజలు



దుర్గానగర్ ఆలయంలో విశేష అలంకరణలో దుర్గాదేవి



పూజలు అందుకున్న మహాలక్ష్మి అమ్మవారు



కొత్తపాలెంలో పూజలందుకున్న దుర్గాదేవి

కంచరపాలెం: కంచరపాలెం, ఊర్వశి జంక్షన్, ఐటీఐ కూడలి, 104 ఏరియా పరిధిలోని ఆలయాల్లో శ్రావణ మాస మొదటి శుక్రవారం పూజలు ఘనంగా ప్రారంభమయ్యాయి. దుర్గానగర్ దుర్గాలయంలో దుర్గాదేవికి, బాపూజీనగర్ మహాలక్ష్మీదేవి ఆలయంలో, పార్వతీశ్వరాలయంలో వరలక్ష్మీదేవికి ప్రధాన అర్చకులు సుబ్రహ్మణ్యశర్మ, సూర్యప్రకాష్ శర్మ, శ్రీనివాసశర్మ నేతృత్వంలో కుంకుమ పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు ఆలయాల కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేసి, ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పారిశ్రామిక ప్రాంతంలో..

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతంలో శ్రావణ శుక్రవార పూజలను భక్తితో నిర్వహించారు. ఆలయాల్లో విశేష పూజలతో పాటు నివాసాల్లో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి అర్చించారు. ఐవోసీ చింతామణి దుర్గాగణపతి ఆలయంలో కొలువుదీరిన లక్ష్మీదేవికి, మల్కాపురం రెడ్డివీధి వద్ద గల సీతారామాలయంలో అమ్మవారికి అర్చకులు పూజలు చేశారు.



నాగేంద్ర కాలనీ సంతోషిమాత ఆలయంలో కుంకుమ పూజలు

గోపాలపట్నం: గోపాలపట్నం పరిసర ప్రాంతాల్లోని సంతోషిమాత, దుర్గా దేవి ఆలయాల్లో శుక్రవారం పూజలు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. శ్రావణమాసం మొదటి శుక్రవారం కావడంతో అమ్మవార్లకు విశేష పూజలు, పసుపుకుంకుమలతో అర్చనలు అభిషేకాలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఇబ్బందులు కలగకుండా తగిన సౌకర్యాలు కల్పించారు.

హమ్మయ్య.. దుర్గంధం తొలగింది



వ్యర్థాలను తొలగిస్తున్న శానిటరీ సిబ్బంది

మల్కాపురం: జీవీఎంసీ 61వ వార్డు మల్కాపురం, కృష్ణ బార్ అండ్ రెస్టారెంట్ వెనుక లైన్ వద్ద చెత్తను పారిశుద్ధ్య సిబ్బంది తొలగించారు. ఈ ప్రాంతంలో చాలామంది వ్యర్థాలను డంప్ చేస్తుండటంతో రోజూ తెల్లవారేసమయానికి సర్వీస్ రోడ్డు కాస్తా డంపింగ్‌యార్డ్‌గా మారుతోంది. గురువారం అర్ధ రాత్రి గుర్తు తెలియని వ్యక్తి, మృతి చెందిన తమ పెంపుడుకుక్కను ఇక్కడ వ్యర్థాల వద్ద వదిలేసి వెళ్లిపోయాడు. దీంతో శుక్రవారం ఉదయం విపరీతమైన దుర్గంధం రావడంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించేవారు ముక్కు మూసుకుని వెళ్లాల్సి వచ్చింది. దీంతో కాలనీవాసులు శానిటరీ ఇన్‌స్పెక్టర్ రమేష్‌కు సమాచారం ఇవ్వడంతో, స్పందించిన ఆయన వెంటనే సిబ్బందిని పంపించి అక్కడ వ్యర్థాలతో పాటు మృతి చెందిన కుక్కను తొలగింపజేశారు. ఆ ప్రాంతంలో బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. దీంతో కాలనీవాసులు శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు, సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.

విశాఖ మెట్రో రైలు ప్రాజెక్ట్‌కు కేంద్రమే నిధులివ్వాలి

దాబాగార్డెన్స్: విశాఖ, విజయవాడ నగరాల మెట్రో రైలు తొలి దశ నిర్మాణ పనులకు రాష్ట్ర మంత్రి మండలి ఆమోదం తెలపడంపై సీపీఎం విశాఖ జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రాజెక్టు వ్యయం మొత్తం కేంద్ర ప్రభుత్వమే భరించాలని శుక్రవారం ఒక ప్రకటనలో ఆయన డిమాండ్ చేశారు. విశాఖ మెట్రో తొలి దశ 46 కిలోమీటర్లకు రూ.11,498 కోట్ల వ్యయం అవుతుందని, ఇందులో సగం ప్రభుత్వ జాయింట్ వెంచర్, ఈక్విటీ ఫండింగ్ ద్వారా చేపడతామని ప్రకటించడాన్ని జగ్గునాయుడు తప్పుబట్టారు. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం–2014 ప్రకారం ఈ మెట్రో ప్రాజెక్టుల నిర్మాణ బాధ్యత పూర్తిగా కేంద్రానిదేనని ఆయన గుర్తు చేశారు. వీఎంఆర్డీఏకు రూ.4,101 కోట్లు సమకూర్చడానికి 1,944 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ ద్వారా సేకరించాలని రాష్ట్ర ప్రభుత్వం ఆదేశించడం దారుణమన్నారు. ఇది రైతుల భూములు, ప్రభుత్వ భూము లను బడా సంపన్నులకు కట్టబెట్టే ప్రయత్నమన్నారు. మెట్రోకు అవసరమైన భూసేకరణకు అయ్యే పరిహారాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించాలని, టీడీఆర్ రూపంలో పరిహారం ఇవ్వాలనే నిర్ణయం ప్రజలకు తీవ్ర నష్టం చేకూరుస్తుందన్నారు. కేంద్రంపై ఒత్తిడి తెచ్చి మెట్రో వ్యయం మొత్తం కేంద్రమే భరించేలా చర్యలు చేపట్టాలని, ల్యాండ్ పూలింగ్ ద్వారా వీఎంఆర్డీఏ 2,000 ఎకరాలు సేకరించాలనే ప్రతిపాదనను రద్దు చేయాలని సీపీఎం తరఫున ఆయన డిమాండ్ చేశారు.

నిరుద్యోగులతో చెలగాటం!

- ఆన్‌లైన్ పరీక్ష కేంద్రం వద్ద కానరాని వసతులు
- డివైడర్లపై అభ్యర్థుల పడిగాపులు



కేంద్రంలోకి వెళ్లే వారిపై దూసుకొస్తున్న వాహనం



కేంద్రంలోకి వెళ్లేందుకు నడిరోడ్డుపై క్యూ

విశాఖ విద్య: ఎన్ఏడీ దరి బుచ్చిరాజుపాలెంలోని (ఏడీజెడ్ ఆరోవనా డిజిటల్ జోన్) ఆన్‌లైన్ కేంద్రంలో పరీక్ష రాసేందుకు వచ్చే నిరుద్యోగులకు అసౌకర్యాలు వెంటాడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వరంగ సంస్థలో వివిధ ఉద్యోగాల భర్తీ కోసం శుక్రవారం స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ) పరీక్షలు నిర్వహించింది. ఇందుకోసం ఎన్ఏడీ బుచ్చిరాజుపాలెం ఏ.డీ.జెడ్.ఆరోవనా డిజిటల్ జోన్‌ను కేంద్రంగా ఎంపిక చేశారు. మూడు షిఫ్టుల్లో నిర్వహించిన పరీక్షకు వందలాది మంది అభ్యర్థులను ఇక్కడ కేటాయించడంతో కేంద్రం పరిసరాలు రద్దీగా మారాయి. బీఆర్‌టీఎస్ రోడ్డుపైనే క్యూ లైన్లు ఏర్పాటు చేయడంతో అభ్యర్థులు అసౌకర్యానికి గురయ్యారు. కేంద్రం లోపల వేచి ఉండేందుకు స్థలం లేకపోవడంతో అభ్యర్థులను నడిరోడ్డుపైనే క్యూ కట్టించారు. ఓ వైపున డివైడర్లపై కొంతమంది కూర్చొనగా, మరో పక్క క్యూ లైన్ .. ఆ మధ్యలోంచి వాహనాలు రాకపోకలు సాగాల్సిన పరిస్థితులు ఇక్కడ నెలకొన్నాయి. వాహనాలు ఎక్కడ తమను ఢీ కొడతాయోనని భయాందోళన నడుమ కేంద్రంలోకి వెళ్లాల్సి వచ్చిందని అభ్యర్థులు ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రం వద్ద సదుపాయాలు లేకపోవడంతో రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్లపై పడిగాపులు కాస్తున్నారు. కేంద్రంలో సరైన సౌకర్యాలు లేకపోయినా అధికారులు పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. నిరుద్యోగ అభ్యర్థులతో చెలగాటం మానుకొని తగిన సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారు.

భారత సైన్యంతో సీఐఎస్ఎఫ్ ఉమ్మడి శిక్షణ

ఉక్కునగరం: భద్రతా సవాళ్లను ఎదుర్కొనేందుకు, కార్యాచరణ సంసిద్ధతను బలోపేతం చేసుకునే దిశగా కేంద్ర పారిశ్రామిక భద్రతా దళం(సీఐఎస్ఎఫ్) కీలక అడుగు వేసింది. ఇందులో భాగంగా భారత సైన్యంతో సీఐఎస్ఎఫ్ ఉమ్మడి శిక్షణా విన్యాసాలను ప్రారంభించనుంది. మొదటిసారిగా సీఐఎస్ఎఫ్ కశ్మీర్ లోయలోని ఉన్నత భారత సైనిక నిర్మాణాల్లో పూర్తి స్థాయి బ్యాచ్‌లకు శిక్షణను నిర్వహించనుంది. ఈ శిక్షణలో నైట్ ఆపరేషన్స్, జంగిల్ వార్‌ఫేర్, క్లోజ్–కాంబాట్ టాక్టిక్స్, ఎండ్యూరెన్స్ బిల్డింగ్ డ్రిల్స్ వంటి అంశాలపై దృష్టి సారించనున్నారు. ఈ హై-ఇంటెన్సిటీ శిక్షణ కోసం 35 ఏళ్లలోపు ఉన్న సీఐఎస్ఎఫ్‌కు చెందిన క్విక్ రియాక్షన్ టీమ్(క్యూఆర్‌టీ)సభ్యులు, నేషనల్ సెక్యూరిటీ గార్డ్(ఎన్ఎస్‌జీ) ప్రమాణాలకు అనుగుణంగా ఉన్న సిబ్బందిని ఎంపిక చేస్తున్నట్లు స్టీల్‌ప్లాంట్ సీఐఎస్ఎఫ్ కమాండెంట్ డి.జితేంద్రబాబు తెలిపారు. ఈ సంయుక్త శిక్షణ సీఐఎస్ఎఫ్ దళాల నైపుణ్యాన్ని, సామర్థ్యాన్ని గణనీయంగా పెంచుతుందని భావిస్తున్నారు.

దోమల కట్టడితో వ్యాధులకు చెక్



కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, నాయకులు, హాస్టల్ విద్యార్థులు

పలు వార్డుల్లో డ్రైడే ఫ్రైడే

గోపాలపట్నం: దోమల వల్ల వ్యాధుల బారిన పడతాం.. అందుకే దోమలను పుట్టనివ్వొద్దు.. కుట్టనివ్వొద్దని జీవీఎంసీ అధికారులు ప్రచారం నిర్వహించారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పలు వార్డుల్లో ప్రచారం చేపట్టారు. 89వ వార్డులో యల్లపువానిపాలెం సాంఘిక సంక్షేమ హాస్టల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కార్పొరేటర్ దాడి వెంకటరమేష్ మాట్లాడుతూ మన పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుంటే దోమలు పెరగవని తెలిపారు. దోమకాటు వల్ల ప్రమాదకరమైన జ్వరాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో హాస్టల్ వార్డెన్ గోవింద్, సచివాలయ కార్యదర్శులు, జీవీఎంసీ సిబ్బంది పాల్గొన్నారు. జీవీఎంసీ 92వ వార్డు శ్రీరామ్‌నగర్‌లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపి ఆధ్వర్యంలో పలు వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలని కోరారు. ఇళ్లల్లో రోజుల తరబడి నీరు నిల్వ ఉంచవద్దని సూచించారు. కార్యక్రమంలో సచివాలయ కార్యదర్శులు, ఆశ వర్కర్లు, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.



శ్రీరామ్‌నగర్‌లో దోమలు పెరిగే విధానాన్ని వివరిస్తున్న శానిటరీ ఇన్‌స్పెక్టర్ గోపి

ఘనంగా శత వసంతాల జన్మదిన వేడుక



100వ పుట్టిన రోజు వేడుకల్లో కుటుంబ సభ్యులతో పుష్పవతి

ఉక్కునగరం: వందేళ్ల మైలురాయిని చేరుకున్న గూడూరు పుష్పవతి పుట్టినరోజు వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. కృష్ణా జిల్లా వణుకూరు గ్రామానికి చెందిన హోల్‌సేల్ పండ్ల వ్యాపారి గూడూరు రామ్మోహన్ రావు సతీమణి పుష్పవతి.. ఎన్నో కష్టాలను ఎదుర్కొని నాలుగు తరాలకు ఆదర్శంగా నిలిచారు. భర్తను, కుమారుడిని, కుమార్తెను కోల్పోయినా మొక్కవోని ధైర్యంతో కుటుంబాన్ని ముందుకు నడిపారు. ఆమె మనుమడు, స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ విభాగంలో డిప్యూటీ మేనేజర్‌గా పదవీ విరమణ చేసిన కడియాల శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఈ పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఆమె మనుమలు, మునిమనమలు, కుటుంబ సభ్యులు హాజరై.. ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు. వందేళ్లు నిండినా ఆమె ఇప్పటికీ తన పనులను తానే చేసుకుంటూ ఆరోగ్యంగా ఉండటం విశేషం.